సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం । 5 । డిసెంబర్ । 2023



టమాట కిలో రూ.20
కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.6.50, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



డైట్.. ఫ్యూచర్ బ్రైట్ 10లో
బుక్కపట్నంలోని జిల్లా విద్యా శిక్షణ కళాశాల (డైట్) ఎందరినో అత్యుత్తమ ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దింది. 1983లో ఏర్పాటైన ఈ కళాశాల రాష్ట్రంలోనే పేరుగాంచింది.

గరిష్టం/కనిష్టం
28.3°/20.9°
జిల్లాలో సోమవారం తుపాను వాతావరణం నెలకొంది. పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా వర్షం కురిసింది. ఉదయం చలి తీవ్రత కొనసాగింది.

న్యూస్‌రీల్

అప్రమత్తంగా ఉండండి

- 'మిచౌంగ్'పై అధికారులతో కలెక్టర్ సమీక్ష



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి అర్బన్: 'మిచౌంగ్' తుపాను ప్రభావం జిల్లాపై చూపే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. సోమవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సహాయ చర్యలపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ అరుణ్ బాబు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...వర్షాల వల్ల ఎవరికీ ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాల సిబ్బంది ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని, పంట ఉత్పత్తులు కాపాడుకునే విధంగా చూడాలన్నారు. అలాగే పాడుబడిన ఇళ్లలో ఎవరూ ఉండకుండా చూడాలని సూచించాలన్నారు. తుపాను నేపథ్యంలో ప్రజలకు వెంటనే సాయం అందించేందుకు కలెక్టరేట్‌లో 08885-292432 నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఎవరికి ఏ అవసరమొచ్చినా కంట్రోల్ రూంను సంప్రదించాలన్నారు. తుపాను తీరం దాటే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

6 మండలాల్లో వర్షం..
తుపాను ప్రభావంతో జిల్లాలోని ఆరు మండలాల్లో వర్షం కురిసింది. కదిరిలో 3.2 మి.మీ., ఓడీచెరువు 2.4, గాండ్లపెంట, నల్లచెరువు 2 మి.మీ., తనకల్లు 1.6, బుక్కపట్నం 1.0 మి.మీ మేర వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మంగళ, బుధ వారాల్లోనూ జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు వెల్లడించారు.

పలు రైళ్ల రద్దు

అనంతపురం సిటీ: కొత్త చెరువు వద్ద టన్నెల్ పనుల నేపథ్యంలో అనంతపురం మీదుగా వెళ్లే వారాంతపు స్పెషల్, రోజూ తిరిగే పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. కోయంబత్తూరు-నిజాముద్దీన్ మధ్య తిరిగే కొంగు ఎక్స్‌ప్రెస్ (రైల్ నంబర్: 12647/12648) రైళ్లను ఈ నెల 7 వరకూ రద్దు చేశారు. యశ్వంతపుర-మచిలీపట్నం వయా అనంతపురం తిరిగే కొండవీడు ఎక్స్‌ప్రెస్ (రైలు నంబర్లు: 17212/17211), యశ్వంతపుర-సికింద్రాబాద్ మధ్య తిరిగే గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (రైళ్ల నంబర్: 12735/12736) రైళ్లను ఫిబ్రవరి 8 వరకు రద్దు చేశారు. ఇక యశ్వంతపుర-ఇండోర్ వయా అనంతపురం, సికింద్రాబాద్ మీదుగా నడిచే ఇండోర్ ఎక్స్‌ప్రెస్ (రైలు నంబర్: 19302) ఫిబ్రవరి 6 వరకు, గుంతకల్లు-హిందూపురం మధ్య తిరిగే డెమో ప్యాసింజర్ (రైళ్ల నంబర్లు: 07693/07694) రైలును ఫిబ్రవరి 8 వరకు రద్దు చేశారు.





రాప్తాడులో సోమవారం నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రకు తరలివచ్చిన జన సందోహంలో ఓ భాగం

సామాజిక సౌరభం

- అన్ని వర్గాలకూ సముచిత స్థానం
- బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి
- సంక్షేమ పథకాలతో ఆర్థిక చేయూత
- బస్సు యాత్రలో ప్రతినిధులు, నేతలు
- రాప్తాడులో సామాజిక సాధికార యాత్ర విజయవంతం



సభలో ప్రసంగిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున, చిత్రంలో మంత్రి గుమ్మనూరు జయరాం, ఎంపీలు గోరంట్ల మాధవ్, నందిగం సురేష్, ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మాలగుండ్ల శంకరనారాయణ, తిప్పేస్వామి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పైలా తదితరులు



జయహో జగన్: మిన్నంటిన జగన్నినాదం

కనగానపల్లి: 'వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమంతో పాటు సామాజిక, రాజకీయ పరంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు తగిన గుర్తింపు లభించింది. స్థానిక సంస్థల మొదలు చట్టసభల్లో ప్రాతినిధ్యం పెరిగింది. నామినేటెడ్ పదవుల్లోనూ అగ్రతాంబూలమే దక్కింది. బడుగు, బలహీన వర్గాలకు సామాజిక న్యాయం జగనన్న పాలనలోనే సాధ్యమైంది' అని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నేతలు స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి నేతృత్వంలో రాప్తాడు నియోజకవర్గ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు మాలగుండ్ల శంకరనారాయణ అధ్యక్షతన సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున తో పాటు శ్రీసత్యసాయి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం, బాపట్ల ఎంపీ నందిగం సురేశ్ హాజరయ్యారు. మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. అనంతరం మంత్రి గుమ్మనూరు జయరాంమాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు నామినేటెడ్ పదవులు కల్పించిన ఘనత వైఎస్ జగన్‌దే అన్నారు. ఎంపీ నందిగం సురేశ్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 99.9 శాతం అమలు చేసి రాష్ట్రంలో పేదరికాన్ని తగ్గించారన్నారు. చంద్రబాబు పాలనలో తనలాంటి బలహీన వర్గాల వ్యక్తిని జైలులో కూర్చోబెడితే.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఎంపీని చేసి పార్లమెంటులో కూర్చోబెట్టారని గుర్తు చేశారు. పక్క రాష్ట్రంలో కాంగ్రెస్ గెలిస్తే టీడీపీ నేతలు సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.

రాప్తాడు జనసంద్రం

సామాజిక సాధికార బస్సు యాత్రకు రాప్తాడు నియోజకవర్గ నలుమూలల నుంచి భారీ సంఖ్యలో జనాలు తరలివచ్చారు. మధ్యాహ్నం నుంచే రాప్తాడు కూడలి జనసంద్రంగా మారింది. బస్సు యాత్రలో ఎమ్మెల్సీ మంగమ్మ, మడకశిర, కదిరి, అనంతపురం ఎమ్మెల్యేలు డాక్టర్ తిప్పేస్వామి, డాక్టర్ పీవీ సిద్ధారెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, అనంతపురం మేయర్ వసీం, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. బస్సు యాత్ర విజయవంతంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్ కనిపించింది.

బడుగులకు జగనన్న అండ



చంద్రబాబు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటే.. వైఎస్ జగన్ వారందరికీ అన్ని రకాలుగా సామాజిక న్యాయం కల్పిస్తూ అండగా నిలిచారు. బలహీన వర్గాల ప్రజలను వెన్నెముకగా భావించిన జగన్.. వారికి రాజకీయ, సామాజిక, ఆర్థికంగా ఎదుగుదలకు తోడ్పాటునిచ్చారు. 'నవరత్నాలు' ద్వారా బడుగు, బలహీన వర్గాల ప్రజలకు నేరుగా బ్యాంకు ఖాతాల్లో రూ.కోట్ల సొమ్ము జమ చేశారు. ఈ పథకాల ద్వారా నాలుగున్నరేళ్లలో రూ.2.45 లక్షల కోట్లను పేదలకు అందించారు. జగనన్న కాలనీల ద్వారా ఊళ్లు నిర్మించారు. రాప్తాడు నియోజకవర్గంలో 'పరిటాల' కుటుంబం 25 ఏళ్ల పాటు రాక్షస పాలన సాగిస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజాస్వామ్యం తీసుకొచ్చాం. సీఎం జగన్ ఆశీస్సులతో నియోజకవర్గంలోని పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకొచ్చి.. ఈ ప్రాంతాన్ని పంటలతో సస్యశ్యామలం చేశాం. గత టీడీపీ ప్రభుత్వంలో రెండు వేల ఇళ్లు మంజూరు చేస్తే.. గడిచిన నాలుగేళ్లలో రాప్తాడు నియోజకవర్గంలోనే సుమారు 25 వేల ఇళ్లు మంజూరు చేయించాం. రెండు వేల మంది రైతుల పొలాల్లో ఉచితంగా బోర్లు వేయించాం. మహిళా సహకార డెయిరీ ద్వారా ఆరువేల మంది మహిళలకు స్వయం ఉపాధి కల్పిస్తున్నాం.

– తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే



ఫుల్ జోష్ : సామాజిక సాధికార యాత్రలో డ్రమ్స్ వాయిద్యాల నడుమ కార్యకర్తల నృత్యం,

జై జగన్ నినాదాలతో హోరెత్తిస్తున్న మహిళలు



జగన్‌తోనే సామాజిక విప్లవం



సీఎం జగన్ రాష్ట్రంలో సామాజిక విప్లవం తీసుకొచ్చారు. బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీలకు రాజకీయంగా పెద్దపీట వేశారు. కుల గణన జరగాలని చెప్పిన మొట్టమొదటి వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఆయా వర్గాలు ముఖ్యమంత్రికి అండగా నిలవాల్సిన సమయం వచ్చింది. గత టీడీపీ హయాంలో రాప్తాడు నియోజకవర్గంలో బాంబులు వేసి.. తుపాకులతో కాల్చి రక్తపుటేర్లు పారాయి. నేడు తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి చెరువులను నీళ్లతో నింపి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశారు. రాప్తాడులో రౌడీల పాలనకు చరమగీతం పాడి ప్రజాస్వామ్యం తీసుకొచ్చారు.

– గోరంట్ల మాధవ్, హిందూపురం ఎంపీ

బడుగులకు సముచిత స్థానం



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజకీయ పదవులు అందించి వారికి సముచిత స్థానం కల్పించారు. అన్ని వర్గాలకూ సమన్యాయం చేసిన సీఎంగా జగన్ ఖ్యాతి గడించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో కురుబ సామాజిక వర్గానికి మంత్రి వర్గంలో చోటు ఇవ్వడంతో పాటు రెండు ఎంపీ పదవులను బీసీలకు ఇచ్చారు. జెడ్పీటీసీ, ఎంపీపీ పదవులకు జనరల్ స్థానాల్లో కూడా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అవకాశం కల్పించారు.

– మాలగుండ్ల శంకరనారాయణ, ఎమ్మెల్యే, పెనుకొండ

మహిళలకు పెద్దపీట వేసిన జగనన్న



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలకు అనేక రాజకీయ పదవులు కట్టబెట్టి పెద్దపీట వేశారు. వెనుకబడిన వాల్మీకి కులానికి చెందిన సామాన్య మహిళ అయిన నాకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా అవకాశం దక్కిందంటే జగనన్న చలువే. రాప్తాడు నియోజకవర్గంలో ఆరు మండలాలకు ఎంపీపీలుగా, రెండు మండలాలకు జెడ్పీటీసీ సభ్యులుగా మహిళలకు అవకాశం కల్పించారు.

– బోయ గిరిజమ్మ, జెడ్పీ చైర్ పర్సన్


అక్కున చేర్చుకుంది జగనే



నా ఎస్సీ, నా బీసీ, నా ఎస్టీ, నా మైనార్టీ అంటూ.. అన్ని వర్గాలనూ అక్కున చేర్చుకున్నది సీఎం జగన్‌మోహన్ రెడ్డి మాత్రమే. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా అణగారిన వర్గాలకు అండగా నిలవలేదు. ఎంతోమంది వెనుకబడిన కులాల వారికి రాజ్యాధికారం కల్పించి వారి గుండెల్లో జగన్ చిరస్థాయిగా నిలిచిపోయారు. ఇలాంటి వారే ముఖ్యమంత్రిగా కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారు.

– పైలా నరసింహయ్య, వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు

అభివృద్ధికి ముందడుగు



కలెక్టరేట్ కాంప్లెక్స్‌కు కేటాయించిన భూమి



పోలీస్ పరేడ్ గ్రౌండులో నిర్మాణ పనుల దృశ్యం

- కలెక్టరేట్ భవన నిర్మాణానికి స్థలం కేటాయింపు
- జోరుగా సాగుతున్న పోలీస్ పరేడ్ గ్రౌండ్ పనులు

పుట్టపర్తి అర్బన్: నూతన జిల్లా శ్రీసత్యసాయి అభివృద్ధికి మరో ముందడుగు పడింది. సరిగ్గా 20 నెలల క్రితం నూతన జిల్లా ఏర్పాటు కాగా, కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయంతో పాటు జిల్లాకు చెందిన వివిధ శాఖల కార్యాలయాలను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ భవనాల్లోనే ఏర్పాటు చేశారు. అయితే పాలనకు కీలకమైన శాఖలకు సొంతంగా భవనాలు నిర్మించాలని భావించిన ప్రభుత్వం నాలుగు నెలల క్రితం కలెక్టరేట్ నిర్మాణానికి రూ.100 కోట్లు మంజూరు చేసింది. వెంటనే స్థల సేకరణ పూర్తి చేయాలని ఆదేశించింది. దీంతో రెవెన్యూ శాఖ పుట్టపర్తి మండలం కప్పలబండ రెవెన్యూ పరిధిలో రైతుల నుంచి గతంలోనే సేకరించిన స్థలాన్ని ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్‌కు కేటాయించింది. వెంటనే ఆ భూమిని ఆర్‌అండ్‌బీ డిపార్టుమెంట్‌కు అప్పగించింది.

15.21 ఎకరాలు సిద్ధం..
పుట్టపర్తి మండలం కప్పలబండ రెవెన్యూ పొలంలో 15.21 ఎకరాలను ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్ భవన నిర్మాణానికి కేటాయించారు. ఇందులో సర్వే నంబర్ 274-1బీలో 2.54 ఎకరాలు, 272-2బీలో 2.49 ఎకరాలు, 274-1ఏ1లో 2.35 ఎకరాలు, 272-2ఏలో 2.63 ఎకరాలు, 272-1లో 5.20 ఎకరాలు ఉన్నాయి. ఈ భవనానికి తూర్పున 30 లింకుల రోడ్డు, దక్షిణం వైపున ఫైర్ స్టేషన్, పడమర, ఉత్తరం వైపున ప్రైవేటు భూములున్నాయి.

అన్ని సేవలు అక్కడే..
ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయితే అన్ని సేవలు కిలోమీటర్‌లోపే అందుబాటులో ఉంటాయి. ఒకపక్క ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్, మరోపక్క అతి పెద్దదైన బుక్కపట్నం చెరువు, ఇంకోవైపు సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, సమీపంలోనే సత్యసాయి విమానాశ్రయం అందుబాటులో ఉన్నాయి. మరికొంత భూమి అవసరమైనా అందుబాటులోనే ఉంది. సమీపంలోనే మరో 100 ఎకరాల్లో పారిశ్రామిక వాడ ఏర్పాటు కానుంది. దీనికి ఇప్పటికే డబుల్ రోడ్డు సౌకర్యం సైతం ఉంది.

17 ఎకరాల్లో జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్.
పుట్టపర్తి రెవెన్యూ పరిధిలోని శిరసాని హిల్స్ వద్ద పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు 17 ఎకరాలను ఇప్పటికే కేటాయించారు. ఇందులో మూడు ఎకరాల్లో పరేడ్ గ్రౌండ్ సిద్ధం చేశారు. తక్కిన స్థలంలోని కొండను చదును చేసే కార్యక్రమం జోరుగా సాగుతోంది. నెల రోజుల నుంచి హిటాచీలు, జేసీబీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు ఏర్పాటు చేసి కొండను చదును చేస్తున్నారు. ఇది పూర్తయితే అన్ని వసతులతో కూడిన పోలీసు పరేడ్ గ్రౌండ్ అందుబాటులోకి వస్తుంది.

15.21 ఎకరాలు కేటాయించాం



పుట్టపర్తి మండలం కప్పలబండ రెవెన్యూ పొలంలో 15.21 ఎకరాల భూమిని ఇంటిగ్రేటెడ్ కలెక్టర్ కాంప్లెక్స్‌కు కేటాయించాం. ఆ వివరాలను ఆర్‌అండ్‌బీకి అందజేశాం. భవన నిర్మాణ స్కెచ్‌లను ప్రభుత్వం ఆమోదించగానే నిర్మాణాలు ప్రారంభిస్తాం.

– అరుణ్‌బాబు, కలెక్టర్

అచేతనుడు.. అసామాన్యుడు

- విభిన్న రంగాల్లో రాణిస్తున్న డాక్టర్ సాయి కౌస్తవ్ దాస్ గుప్తా
- మోటివేషన్ స్పీకర్‌గా అంతర్జాతీయ స్థాయి గుర్తింపు
- తాజాగా రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకున్న అసాధారణ ప్రతిభావంతుడు



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సాయి కౌస్తవ్



కుటుంబ సభ్యులతో సాయి కౌస్తవ్

పుట్టపర్తి రూరల్: అనారోగ్యంతో చక్రాల కుర్చీకే పరిమితమైనా అసాధారణ ప్రతిభతో జాతీయ స్థాయిలో మెరిశాడు పుట్టపర్తికి చెందిన కౌస్తవ్ దాస్ గుప్తా. వెబ్ డిజైనర్, అంతర్జాతీయ గ్రాఫిక్ డిజైనర్, గ్లోబల్ మోటివేషన్ స్పీకర్, హ్యాపీనెస్ కోచ్, గుడ్ విల్ అంబాసిడర్, రైటర్...ఇలా భిన్న రంగాల్లో రాణిస్తూ తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నాడు. అచేతనుడైనా అన్ని రంగాల్లో రాణిస్తూ ఎందరికో మార్గదర్శకంగా మారిన కౌస్తవ్ దాస్ గుప్తాను అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఆదివారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతీయ అవార్డు అందజేసి సత్కరించారు.

ఎవరీ కౌస్తవ్ దాస్..
బెంగాల్ రాష్ట్రానికి చెందిన కౌశిక్ దాస్ గుప్తా, షీలా దాస్ గుప్తా దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు కౌస్తవ్ దాస్ గుప్తా. పిల్లాడిని అల్లారుముద్దుగా పెంచుకున్న ఆ దంపతులు సంగీత, నాట్యం నేర్పించారు. ఈ క్రమంలో తన ఐదో ఏటే సంగీతం, నాట్యంలో కౌస్తవ్ దాస్ గుప్తా మేటిగా నిలిచాడు. అయితే ఆ చిన్నారి అసాధారణ ప్రతిభ చూసి విధికి కన్నుకుట్టింది. వింత రోగం శరీరంలోని 50 ఎముకలను విరిచేసింది. దీంతో అతను చక్రాల కుర్చీకే పరిమతమయ్యాడు. ఈ సమయంలోనే కౌశిక్ దాస్ గుప్తా, షీలా దాస్ గుప్తా దంపతులు 20 ఏళ్ల క్రితం పుట్టపర్తి వచ్చి సత్యసాయి చెంత చేరారు. బాబా ఆశీస్సులతో కౌశిక్ దాస్ చైతన్య జ్యోతి మ్యూజియంలో ఉద్యోగం సంపాదించి ఇక్కడే స్థిరపడ్డాడు. చక్రాల కుర్చీకే పరిమితమైన అతని కుమారుడు కౌస్తవ్ దాస్ గుప్తా జీవిత పోరాటం మాత్రం ఆపలేదు. తల్లి సాయంతో చక్రాల కుర్చీలో ఉంటూనే తన ఎడమ చేతి రెండు వేళ్ల సాయంతో తక్కువ సమయంలో అక్షరాలు టైప్ చేయడం ప్రారంభించాడు. కంప్యూటర్ మౌస్ ద్వారా వెబ్ డిజైనింగ్ చేసేవాడు. అనతి కాలంలోనే ఇంటర్నేషనల్ గ్రాఫిక్ డిజైనర్‌గా, గ్లోబల్ మోటివేషన్ స్పీకర్‌గా, హ్యాపీనెస్ కోచ్‌గా, గుడ్ విల్ అంబాసిడర్‌గా, రైటర్‌గా పేరు ప్రఖ్యాతలు తెచ్చుకున్నాడు. దాదాపు 300 పాటలకుపైగా ట్యూన్లు కట్టి విడుదల చేశాడు. సానుకూల దృక్పథం అంగవైకల్యాన్ని జయిస్తుందని ప్రపంచానికి చాటి చెప్పాడు. ఈ క్రమంలోనే అమెరికా, ఆస్ట్రేలియా, సింగపూర్, మలేషియా, థాయిలాండ్ దేశాల్లో తన స్ఫూర్తి వంతమైన ప్రసంగాలతో ప్రపంచాన్ని ఆకట్టుకున్నాడు.

అవార్డులు.. డాక్టరేట్లు
విధిని ఎదురించి ఎన్నో రంగాల్లో రాణిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలిచిన కౌస్తవ్ దాస్ గుప్తాను ఎన్నో అవార్డులు వరించాయి. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, చాంపియన్ ఫిట్నెస్, గుడ్ విల్ అంబాసిడర్, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ తదితర 16 అంతర్జాతీయ అవార్డులు, జాతీయ, రాష్ట్రీయ విభిన్న ప్రతిభావంతుల అవార్డులు, డాక్టరేట్లు, దేశ, విదేశీ నేతలు ప్రముఖుల చేత సుమారు 500 పైగా అవార్డులు అందుకున్నాడు. ఈ నేపథ్యంలోనే భారత ప్రభుత్వమూ డాక్టర్ సాయి కౌస్తవ్ దాస్ గుప్తాను జాతీయ అవార్డుతో సత్కరించింది.

క్లుప్తంగా

నేటితో ముగియనున్న పింఛన్ల పంపిణీ

పుట్టపర్తి అర్బన్: వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీలో భాగంగా జిల్లాలో సోమవారం నాటికి 98.7 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయింది. ఈ కార్యక్రమం మంగళవారంతో ముగియనుంది. వలంటీర్ల సహకారంతో నాలుగు రోజుల్లో 2,67,011 మంది లబ్ధిదారులకు రూ.74,20,63,500 నగదును పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య వెల్లడించారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి


నాగభూషణ (ఫైల్)

కదిరి అర్బన్: కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ నాగభూషణ (50) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. తెల్లవారుజామున ఛాతీలో నొప్పిగా ఉందని తెలపడంతో వెంటనే కదిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. నాగభూషణ స్వగ్రామమైన తలుపుల మండలం వేపమానిపేటలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు

తలుపుల: నాగభూషణ స్వగ్రామమైన తలుపుల మండలం వేపమానిపేటలో సోమవారం సాయంత్రం పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కదిరి డీఎస్పీ శ్రీలక్ష్మి, సీఐలు సూర్యనారాయణ, మధు, ఎస్‌ఐలు మగ్బూల్‌బాషా, బాబ్జాన్, సిబ్బంది, పోలీస్ అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. తక్షణ సాయం కింద రూ.25 వేలను అందజేశారు. విషయం తెలుసుకున్న ఎస్పీ మాధవరెడ్డి... నాగభూషణ కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అధైర్య పడరాదని, అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు.

డైట్.. ఫ్యూచర్ బ్రైట్

దేశ భవిష్యత్తు తరగతి గదిలో రూపుదిద్దుకుంటుందంటారు. అలాంటి తరగతుల నిర్వాహకులైన ఉపాధ్యాయులను తీర్చిదిద్దే జిల్లా విద్యా శిక్షణ కళాశాల (డైట్) మరెంత గొప్పదో మాటల్లో చెప్పలేం. ఉన్న స్థానం నుంచి ఉన్నత స్థానానికి చేర్చే దైవమే ఉపాధ్యాయుడు. మనం పుట్టినప్పటి నుంచి జీవితంలో స్థిరపడే వరకూ ప్రతి దశలోనూ ఉపాధ్యాయుడి ముద్ర తప్పనిసరిగా ఉంటోంది. 'అ.. ఆ' లతో మొదలయ్యే ప్రస్థానంలో ప్రతి అడుగు చేయి పట్టుకుని మన భవిష్యత్తును నడిపించేదే మన గురువులే. పాఠశాల లేని పల్లెటూరైనా ఉంటుందేమో కానీ... ఉపాధ్యాయుడు లేని ఊరు మాత్రం ఉండదు. ఉపాయుడు ఎక్కడివాడైనా ఆ స్థానం అత్యుత్తమమైనది. అనిర్వచనీయమైనది. అంతటి మహోన్నతి వ్యక్తిగా ఎదిగేందుకు దోహదపడుతూ వస్తున్న బుక్కపట్నంలోని ఉపాధ్యాయ వృత్తి విద్య శిక్షణ సంస్థ (డైట్)పై 'సాక్షి' ప్రత్యేక కథనం.

- ఉపాధ్యాయుల ఉత్పత్తి కేంద్రంగా మారిన బుక్కపట్నం 'డైట్'
- ఉమ్మడి రాష్ట్రంలోనే ప్రత్యేకత సంతరించుకున్న కళాశాల


బుక్కపట్నంలోని డైట్ కళాశాలలో శిక్షణకు హాజరైన ఛాత్రోపాధ్యాయులు

పుట్టపర్తి: ఆధ్యాత్మిక బోధనలతో ప్రేమ, శాంతిని పంచిన భగవాన్ సత్యసాయిబాబా... తన ప్రాథమిక విద్యాభ్యాసం చేసిన బుక్కపట్నం కేంద్రంగా 1983లో డైట్ కళాశాలను అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఏకైక ప్రభుత్వ డైట్ కళాశాలగా నిలిచినా... వాస్తవానికి ఉమ్మడి తెలుగు రాష్ట్రంలోనే బుక్కపట్నం డైట్ కళాశాలకు చాలా ప్రత్యేకత ఉంది. ఇక్కడ ఒక్కసారి విద్యార్థిగా అడుగు పెట్టిన వారెందరో దేశాభివృద్ధిలో నిర్ణయాత్మక శక్తులుగా ఎదిగారు. ఇప్పటి వరకూ శిక్షణ పొందిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతుండడం గమనార్హం. 1983 నుంచి 1999 వరకూ శిక్షణ కాల వ్యవధి ఏడాది మాత్రమే. ఈ సమయంలో ఏటా 150 మంది చొప్పున 16 సంవత్సరాల్లో 2,400 మంది శిక్షణ పూర్తి చేసుకుని బయటకు వచ్చారు. వీరందరూ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా రాణించారు. 1999 తర్వాత శిక్షణ కాలాన్ని రెండేళ్లకు ప్రభుత్వం పెంచింది. దీంతో 2000 నుంచి ఏటా వంద మంది చొప్పున ఇప్పటి వరకూ 2,300 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారు. వీరిలో దాదాపు రెండు వేల మందికి పైగా ప్రభుత్వ కొలువులు సాధించడం గమనార్హం.

ఇంటర్ తర్వాత కొలువు దీర్చే కోర్సు..

ఇంటర్మీడియట్ తర్వాత ఏ కోర్సులో చేరాలనే సందేహాలు చాలామంది విద్యార్థులు, తల్లిదండ్రులను వెన్నాడుతోంది. ఇంటర్ తర్వాత ఎన్నో కెరీర్ ఆప్షన్లు ఉన్నా.. కోర్సు ఎంపిక చేసుకోవడంలో తికమక పడిపోతుంటారు. ఈ తికమకకు తెరవేస్తూ ఇంటర్ పూర్తి చేసిన టీచర్ ట్రైనింగ్ కోర్సు (టీటీసీ) ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు. కేవలం రెండేళ్ల వ్యవధిలోనే టీటీసీ పూర్తవుతుంది. గతంలో డైట్‌లో ఒక ఏడాది మాత్రమే శిక్షణ కాలముండేది. 1999 నుంచి రెండేళ్ల వ్యవధి ఉన్న కోర్సుగా మార్చారు. టీటీసీ వద్దనుకుంటే డీఈఈ సెట్ రాసి డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ (డీఈడీ)లో చేరవచ్చు. రెండేళ్ల కాల వ్యవధి ఉన్న ఈ కోర్సులో చేరేందుకు ఇంటర్ పరీక్ష రాస్తున్న వారూ అర్హులే. అయితే కోర్సులో చేరే సమయానికి ఇంటర్ ఉత్తీర్ణత సాధించి ఉండాలి. ఈ కోర్సు పూర్తికాగానే టెట్, డీఎస్సీలో అర్హత సాధించి ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించవచ్చు. ఇలా బుక్కపట్నంలోని డైట్ కళాశాలలో చేరిన ఎందరో నేడు ఉపాధ్యాయ వృత్తిలో రాణిస్తూ దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నారు.

డైట్‌లో శిక్షణ చాలా బాగుంది



బుక్కపట్నంలోని డైట్‌లో 2000–02లో నేను శిక్షణ పొందాను. అదే ఏడాది నిర్వహించిన డీఎస్సీలో ఉద్యోగం వచ్చింది. కళాశాలలో సౌకర్యాలు చాలా బాగున్నాయి. నిష్ణాతులైన అధ్యాపకుల బోధన, వారి సలహాలు, సూచనల కారణంగా మాలో బోధనా నైపుణ్యాలు మెరుగుపడ్డాయి. ఉపాధ్యాయ వృత్తి ఎంతో సంతృప్తినిస్తోంది. – **అనిత, ఉపాధ్యాయురాలు, బుక్కపట్నం**

అందరికీ ఉద్యోగాలు దక్కాయి



బుక్కపట్నంలోని డైట్ కళాశాలలో 2008–09లో టీచర్ ట్రైనింగ్ పూర్తి చేశాను. అప్పట్లో ఏడాది వ్యవధిలోనే కోర్సు పూర్తయ్యేది. శిక్షణ పూర్తి కాగానే ఉద్యోగం వచ్చింది. ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతుండంతో ఎంతో సంతోషంగా ఉంది. ఇక్కడ శిక్షణ పొందిన ప్రతి ఒక్కరూ ఉపాధ్యాయులగా స్థిరపడ్డారు.
– **లక్ష్మి, ఉపాధ్యాయురాలు, కొత్తచెరువు**

విద్యాలయం కాదు ఓ దేవాలయం



బుక్కపట్నంలోని డైట్ కళాశాల విద్యాలయం కాదు ఓ దేవాలయం. నాతో పాటు నా ఇద్దరు చెల్లెళ్లు ఇక్కడే కోర్సు అభ్యసించారు. ప్రస్తుతం ముగ్గురమూ ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నాం. ఉన్నత సాంకేతిక విద్యను అభ్యసించలేని నిరుపేదలకు డైట్ కళాశాల ఓ వరంగా మారింది.
– **కవిత, ఉపాధ్యాయురాలు, బుక్కపట్నం**

అరుదైన గొప్ప అవకాశం



బుక్కపట్నం డైట్‌లో ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేయడాన్ని నాకు దక్కిన అరుదైన అవకాశంగా భావిస్తా. ఇక్కడ శిక్షణ పొందిన ప్రతి ఒక్కరూ సమాజంలో గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తిలో రాణిస్తున్నారు. ఇది నాకెంతో గర్వకారణం.
– **వెన్నెల సోనీ, ఉపాధ్యాయురాలు, రాయదుర్గం**

విలువలు నేర్పే విద్యాలయం



బుక్కపట్నంలోని డైట్ కళాశాల మానవ సంబంధాలు, నైతిక విలువలు నేర్పే ఓ విద్యాలయం. శిక్షణ సమయంలో ఇక్కడ ఎన్నో విలువైన అంశాలను నేర్చుకున్నాం. మా గురువుల స్ఫూర్తితోనే పాఠ్యాంశాలు బోధిస్తూ ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెస్తున్నాం.
– **మంజుల, స్కూల్ అసిస్టెంట్, రాయదుర్గం**

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది



ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవమైనది. బుక్కపట్నంలోని డైట్ కళాశాలకు ఉమ్మడి రాష్ట్రంలోనే ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడ శిక్షణ పొందితే కచ్చితంగా ప్రభుత్వ ఉద్యోగం వస్తుందని ప్రతి ఒక్కరూ భావిస్తారు. నిష్ణాతులైన అధ్యాపకులతో విలువలతో కూడిన శిక్షణను అందిస్తున్నాం.
– **రామకృష్ణ, డైట్ కళాశాల ప్రిన్సిపాల్, బుక్కపట్నం**

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి

- నూతన చైర్‌పర్సన్ ఫిర్దోస్‌భాను ఖలీల్


ఫిర్దోస్‌భానుకు శుభాకాంక్షలు తెలుపుతున్న యార్డు వ్యాపారుల సంఘం నాయకులు

హిందూపురం: రైతులు వ్యాపారులు సంయుక్తంగా మార్కెట్‌యార్డులో సానుకూల వాతావరణంలో కొనుగోళ్లు సాగించేలా తనవంతు కృషిచేస్తానని హిందూపురం మార్కెట్ యార్డు నూతన చైర్‌పర్సన్ ఆర్‌కే ఫిర్దోస్‌భాను ఖలీల్ అన్నారు. సోమవారం మార్కెట్ యార్డులో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వ్యాపారులు, రైతు సంఘం నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కిషోర్ కుమార్, కమిటీ వైస్‌చైర్మన్ మహేంద్రరెడ్డి, సభ్యులు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎస్.దీపిక, నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మడకశిర రూరల్: మండలంలోని గొడనహళ్లికి చెందిన రామాంజప్ప (45) ఆర్థిక ఇబ్బందులు తాళలేక సోమవారం తెల్లవారుజామున గ్రామ శివారులోని చింత చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

'పోలీసు స్పందన'కు 20 వినతులు


ఎస్పీ మాధవరెడ్డికి ఫిర్యాదు చేసేందుకు వచ్చిన కొటిపి వాసులు

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 20 వినతులు అందాయి. ఎస్పీ మాధవరెడ్డి స్వయంగా అర్జీలు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, దిశ డీఎస్పీ వరప్రసాద్, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి పాల్గొన్నారు.

మేనల్లుడి హత్యకు కారుకులైన వారిని శిక్షించండి ..

తన మేనల్లుడి హత్యకు కారకులైన వారిని కఠిన శిక్షపడేలా చేయాలంటూ స్పందన కార్యక్రమంలో ఎస్పీ మాధవరెడ్డిని హిందూపురం సమీపంలోని కొటిపి గ్రామానికి చెందిన గంగమ్మ వేడుకుంది. ఈ మేరకు గ్రామస్తులతో కలసి వచ్చిన ఆమె ఎస్పీ మాధవరెడ్డిని కలసి వినతి అందజేసి, మాట్లాడింది. తనకు సంతానం లేని కారణంగా అన్న కుమారుడు నాగరాజును చిన్నప్పటి నుంచి పెంచుకుంటున్నట్లు వివరించారు. గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడన్న కారణంతో గత నెల 4న పథకం ప్రకారం తన మేనల్లుడిని హతమార్చి తన అన్న ఇంటి వరండాలో మృతదేహాన్ని పడుకోబెట్టి వెళ్లారని కన్నీటి పర్యంతమైంది. ఐదు రోజుల తర్వాత అసలు విషయం వెలుగుచూడడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని, దీంతో నవంబర్ 23న తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేయడంతో పాతి పెట్టిన మృతదేహాన్ని వెలికి తీయించి పోస్టుమార్టం చేయించారని వివరించారు. అయితే పోస్టుమార్టం నివేదిక తమకు ఇవ్వకుండా కేసును పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేకూర్చాలని విన్నవించారు.

ఆర్చ్‌ను ఢీకొన్న బస్సు


ప్రమాదానికి గురైన ఆర్టీసీ అద్దె బస్సు


పెనుకొండ రూరల్: డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో బస్సు నేరుగా వెళ్లి ఆర్చ్‌ను ఢీకొని, పక్కనే ఉన్న పొదల్లోకి దూసుకెళ్లింది. వివరాలు... పుట్టపర్తి ఆర్టీసీ డిపో పరిధిలోని అద్దె బస్సు (ఏపీ 39 యుఎల్ 1203) సోమవారం ఉదయం హిందూపురం నుంచి 20 మంది ప్రయాణికులతో పుట్టపర్తికి బయలుదేరింది. పెనుకొండ మండలం శెట్టిపల్లి క్రాస్ వద్దకు చేరుకోగానే డ్రైవర్ వేగ నియంత్రణ కోల్పోయి ఎదురుగా ఉన్న ఆర్చ్‌ను ఢీకొని, పక్కనే ఉన్న ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లాడు. బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. కదిరికి చెందిన డ్రైవర్ వెంకటేష్‌తో పాటు మరో ముగ్గురు ప్రయాణికులు గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే 108 అంబులెన్స్ ద్వారా పెనుకొండలోని ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురానికి తీసుకెళ్లారు. గాయపడిన వారిలో పుట్టపర్తికి చెందిన కండెక్టర్ ప్రశాంతి, ప్రయాణికులు రజియా (బండ్లపల్లి), ఆదిలక్ష్మి (ఎర్రబల్లి) ఉన్నారు. సమాచారం అందుకున్న పుట్టపర్తి డిపో మేనేజర్ ఇనాయతుల్లా, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పెద్దన్న సంఘటన స్థలాన్ని పరిశీలించి, ఆస్పత్రిలోని క్షతగాత్రులను పరామర్శించారు.

స్పందనకు 120 వినతులు

పుట్టపర్తి అర్బన్: సాంకేతిక కారణాలతో సోమవారం జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని కలెక్టర్ అరుణ్‌బాబు రద్దు చేసినా వందలాది మంది ఫిర్యాదుదారులు తరలిరావడంతో అధికారులు అర్జీల స్వీకరణ ప్రక్రియ చేపట్టారు. ఇందు కోసం ప్రత్యేకంగా కొంత మంది సిబ్బందిని కేటాయించారు. స్వీకరించిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపేలా చర్యలు తీసుకున్నారు. దీంతో వివిధ సమస్యలపై 120 వినతులు అందాయి.

నవ దంపతుల దుర్మరణం

- బైక్‌ను ఈడ్చుకెళ్లిన లారీ


శ్రీరంగప్ప, సుమ (ఫైల్)

గుడిబండ: తుమకూరు జిల్లా మధుగిరి తాలుకా దాసరహళ్లి గ్రామ సమీపాన ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీరంగప్ప (35), భార్య సుమ (26) దుర్మరణం చెందారు. వివరాలు.. గుడిబండ మండలం మోరుబాగల్ సచివాలయంలో విలేజ్ సర్వేయర్‌గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీరంగప్ప, తన భార్యతో కలిసి ఆదివారం ఉదయం తన అత్తారింటికి స్వగ్రామమైన కల్లురొప్పం నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యలోని దాసరహళ్లి సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వేగంగా వచ్చిన లారీ ఢీకొని సుమారు 300 మీటర్ల దూరం ఈడ్చుకెళ్లింది. శ్రీరంగప్ప అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. తీవ్రంగా గాయపడిన సుమను స్థానికులు వెంటనే తుమకూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. కాగా, మూడు నెలల క్రితమే శ్రీరంగప్పకు పెళ్లి జరిగింది. నవదంపతుల మృతితో కల్లురొప్పంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సోమవారం ఉదయం కల్లురొప్పంలో అంత్యక్రియలు జరిగాయి. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సచివాలయం సిబ్బంది తదితరులు నివాళులు అర్పించారు.